కథ

# మౌనోపదేశం

- వంగీపురం పద్మనాభన్

**మూడు** ముళ్ళు, ఏడడుగులు, మధుపర్కాలు, జీలకర్ర బెల్లం, తాళిబొట్టు, తలంబ్రాలు కొన్ని మంత్రాలు వెరసి ఒక పెళ్ళి. రెండు మనసులను కలిపి క్రొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ఏర్పరచిన ఒక సామాజిక కట్టుబాటు. ప్రేమ వివాహమైనా, పెద్దలు నిర్ణయించిన వివాహమైనా భార్యాభర్తలు పిల్లాపాపలతో నాలుగుకాలాలపాటు సుఖ జీవనం గడపాలన్నదే దీని ముఖ్యోద్దేశం

భార్యాభర్తలు ఒకరినొకరు అర్థంచేసుకుని, సర్దుకుపోతే ఆ సంసారం ఒక స్వర్గధామం.

ఒకరినొకరు అపార్థం చేసుకుని ఎడమొహం పెడమొహంగా ఉంటే ఆ సంసారం ఒక నరక కూపం.

భార్యాభర్తలు తమ కష్టసుఖాలను పంచు కోవాలన్నదే పెళ్ళి. పెళ్ళి వ్యవస్థలో అంతర్లీనంగా ఉండే ఒక హితం.

భార్యాభర్తలు తమ కష్టసుఖాలను పంచు కోవాలన్నదే పెళ్ళి. పెళ్ళి వ్యవస్థలో అంతర్లీనంగా ఉండే ఒక హితం.

శశాంక్‌కు పెళ్ళయి ఆరేళ్ళయింది. భార్య ప్రియాంక. ఐదేళ్ళ కూతురు కృత్తిక యూకేజీ చదువుతూంది.

పెళ్ళయిన కొత్తల్లో ప్రియాంక తను చాలా అదృష్టవంతురాలినని, తనభర్త తనను చాలా బాగా చూసుకుంటున్నాడని మురిసిపోయేది.

తనకు అనుకూలమైన భర్తను ప్రసాదించినందుకు కనిపించిన దేవుళ్ళకందరికి కృతజ్ఞతలు తెలుపుకునేది. అది ఎంతోకాలం సాగలేదు.

క్రమంగా శశాంక్‌లో కొంత మార్పు వచ్చింది. పెళ్ళిలో మంత్రాల చాటున చేసిన వాగ్దానాలను మరిచాడు. జీవితంలో స్నేహితులే ముఖ్యమయ్యారు. ప్రతిదానికి భార్యను విసుక్కునేవాడు. భార్యతో మాట్లాడకుండా బాగా తగ్గించేశాడు.

ప్రియాంక మనసు విలవిల్లాడి పోయేది. భర్తకు తను ఏలోటూ చేయలేదు. ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడో ఆమెకు అర్థం కావడంలేదు. మునుపట్లో ఆఫీసునుంచి త్వరగా వచ్చే శశాంక్ ఇప్పుడు ఇంటికెప్పుడొస్తాడో తెలియడం లేదు.

ఆలస్యంగా వచ్చినా ప్రియాంక భర్తకోసం వెయిట్ చేసి, భర్తతో పోటే భోంచేసేది. ఒకరోజు ప్రియాంక ధైర్యంచేసి భర్తతో అంది, "ఏవండీ! త్వరగా రావచ్చుకదా! వేళకాని వేళ భోంచేస్తే ఆరోగ్యం పాడైపోతుందండి."

"నీకు ఆకలైతే నీవుతిని పడుకో, అంతేకాని నాకు నీతులు చెప్పేపని పెట్టుకోకు" అని విసురుగా అన్నాడు శశాంక్. ప్రియాంక మనసు చివుక్కుమంది.

ఈ మధ్య కృత్తిక కూడా నాన్నని చూస్తే భయపడుతోంది. ఎప్పుడూ అమ్మకొంగునే పట్టుకుని భయం భయంగా చూస్తూ వుంటుంది.

భార్యాభర్తల మధ్య మాటలులేని పరిస్థితి ఏర్పడింది. శశాంక్ ప్రవర్తనలో మార్పురావడంలేదు. తను, తన స్నేహితులు, తన వ్యవహారం ఇంటి గురించి పట్టించు కోవడం మానేశాడు శశాంక్.

ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. అత్త, మామలకు చెప్తే "ఆడదానివి నీవే

**ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. అత్త, మామలకు చెప్తే "ఆడదానివి నీవే సర్దుకుపోవాలమ్మా" అనొచ్చు. అమ్మా నాన్నలకు చెప్తే తను బాధపడడమే కాకుండా అందరిని బాధపెట్టినట్టవుతుంది. ఏమీతోచని పరిస్థితి ఏర్పడింది ప్రియాంకకి.**

సర్దుకుపోవాలమ్మా" అనొచ్చు. అమ్మా నాన్నలకు చెప్తే తను బాధపడడమే కాకుండా అందరిని బాధపెట్టినట్టవుతుంది. ఏమీతోచని పరిస్థితి ఏర్పడింది ప్రియాంకకి. కృత్తికను అడ్డుపెట్టుకుని మాటలు కలుపుదామన్నా కుదరడంలేదు. కృత్తిక స్కూల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్. వచ్చే శనివారం పిల్లల తల్లిదండ్రులిద్దరూ రావాలని డైరీలో రాసి పంపించారు.

ప్రియాంక ధైర్యంచేసి భర్తతో చెప్పింది.

"అదేమీ ఇంజినీరింగ్ చదువేమీ చదవడంలేదులే, ఒక్కళ్ళు వెళ్తేచాలు. నీవు వెళ్ళు" అని కరుకుగా సమాధానం చెప్పాడు.

విధిలేక ప్రియాంక మాత్రమే వెళ్ళింది. క్లాస్ టీచర్ కృత్తిక గురించి "మీ అమ్మాయి క్లాసులో ముభావంగా ఉంటోంది, ఏది అడిగినా ఆలస్యంగా జవాబు చెప్తోంది. మీరు కాస్త ఇంటి దగ్గర చదివించాలి" అంది. ఇంటి పరిస్థితి చెప్పుకోలేక "అలాగేనండీ" అని బయలుదేరింది.

ఎప్పటిలాగే ఆరోజుకూడా శశాంక్ ఆలస్యంగా వచ్చాడు. స్కూల్లో జరిగిన విషయం చెబ్దామనే అనుకుంది గాని ధైర్యం చేయలేక పోయింది. శశాంక్ కూడా దాని గురించి అడగలేదు. మరుసటి రోజు ప్రియాంక రోజువారి కార్యక్రమాలు మొదలుపెట్టింది. అన్ని పనులూ అవుతున్నా భర్త ఇంకా పడుకునే వున్నాడు. ప్రియాంక కంగారుపడింది.

"ఏవండీ, ఇంకా లేవలేదేంటి? తరువాత మీకు ఆఫీసుకి ఆలస్యమైపోతుంది" అంది. శశాంక్ ఏమీ మాట్లాడలేదు. లేచి ముభావంగా తన పనులు చేసుకుని కొద్దిగా భోంచేసి, ఆఫీసుకి బయలుదేరే ముందు ఏదో ట్యాబ్లెట్ వేసుకుని బయలుదేరాడు.

ఆరోజు ఏదో తేడాగా అనిపించిన ప్రియాంక, భర్త వాలకాన్ని గమనిస్తూనే వుంది. ఎప్పుడైతే ట్యాబ్లెట్ వేసుకున్నాడో, అప్పుడు అనుమానం వచ్చింది ప్రియాంకకి. "ఏవండీ! ఏమైందండీ? ఒంట్లో బాగోలేదా? చెప్పండి" అని మరీ మరీ అడిగింది. "ఏమీలేదు, కాస్త నలతగా వుంది! అంతే! ట్యాబ్లెట్ వేసుకున్నాగా" అని హడావుడిగా వెళ్ళిపోయాడు.

ప్రియాంక కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. భర్త ఆరోగ్య పరిస్థితి ఏంటో కూడా తెలుసుకోలేని నిస్సహాయ స్థితిలో వున్నందుకు బాధపడింది. భర్త మూర్ఖత్వం ఏం కొంపముంచుతుందోనని భయపడింది.

ప్రియాంక భయపడినట్లే, ఆరోజు శశాంక్ ఆఫీసు నుండి మధ్యాహ్నమే ఇంటికి వచ్చేశాడు.

వేళకాని వేళ భర్తను చూసి విస్తుపోయింది. శశాంక్ నేరుగా బెడ్‌రూంకెళ్ళి బెడ్‌మీద పడిపోయాడు. ఒళ్ళు విపరీతంగా కాలిపోతోంది. జ్వరం ఎక్కువగా వున్నట్టుంది.

"ఏవండీ! మీ ఒళ్ళు విపరీతంగా కాలుతోంది, రండి, డాక్టర్ దగ్గరకు వెళ్దాం" అంది.

"ఏమీ అక్కర్లేదు, ట్యాబ్లెట్ వేసుకున్నాను అదే తగ్గిపోతుంది" అన్నాడు. భర్తమాటను మీరి తను ఏమీ మాట్లాడలేకపోయింది. శశాంక్ బెడ్‌మీద మెలికలు తిరిగి పోతున్నాడు. ఏదైనా సహాయం చేద్దామంటే ఏమంటాడోనని భయం. అలాగే చూస్తూ నిద్రపోయింది ప్రియాంక.

మరుసటి రోజు ఉదయం శశాంక్ మూలుగు ఎక్కువైంది. భార్యను పిలుస్తున్నాడు. "ప్రియాంక! నాకు జ్వరం తగ్గలేదు. ఒళ్ళు నొప్పులు, కీళ్ళనొప్పులు కూడా ఎక్కువైనాయి. డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళవా" అని దీనంగా అడిగాడు.

శశాంక్ అభ్యర్థన ప్రియాంక మనసును పిండేసింది. ప్రియాంక కూడా నిశ్చయంతో అనుకుంది. తనకు భార్య స్థానమేమిటో, భార్య అవసరమేమిటో ఒకరినొకరు అర్థం

శశాంక్ నివ్వెరపోయాడు. ఆ నిస్సహాయ స్థితిలో భార్య మౌనముద్ర అతని కళ్ళలో నీళ్లయ్యాయి. కళ్ళ నిండా నీళ్ళతో భార్యను అలాగే చూస్తూ కూర్చున్నాడు.

చేసుకోవటమంటే ఏమిటో తెలియచేయాలనుకుంది. అందుకే అన్ని పనులూ చేస్తున్నా మౌనమే ఆయుధంగా ఎంచుకుంది.

తను తయారై భర్తను డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళింది. డాక్టర్ వ్యాధి లక్షణాలను చూసి దాన్ని "చికున్ గున్యాగా" నిర్ధారించాడు. మందులు రాసిచ్చాడు. జ్వరమైతే తగ్గుతుంది గాని, కీళ్ళ నొప్పులు ఎప్పుడు తగ్గుతుందో చెప్పలేమని డాక్టరు చెప్పాడు. ఈ వ్యాధి పగటిపూట తిరిగే దోమకాటు వల్ల వస్తుంది. కాబట్టి ఇంట్లో దోమలు లేకుండా చేసుకుని,మిగతావాళ్ళు కూడా జాగ్రత్త పడడం తప్ప వేరే నివారణ మార్గం లేదని కూడా డాక్టరు జాగ్రత్తలు చెప్పాడు.

డాక్టరు రాసిచ్చిన మందులు కొనుక్కుని ఇల్లు చేరుకున్నారు. శశాంక్‌కి కదలలేని పరిస్థితి. ప్రతి విషయానికి భార్యను పిలవాల్సి వస్తోంది. ప్రియాంక చాలా ఓపిగ్గా పనులు చేసుకుపోతోంది.

శశాంక్ మాట్లాడే ప్రతి మాటకి జవాబు కార్య రూపంలో వస్తోంది తప్పమాట రూపంలో రావడంలేదు.

కూతురితో ఆడుకుందామంటే దగ్గరకు రావడానికే భయపడుతోంది. శశాంక్‌కి ఇరవై నాలుగ్గంటలకే పిచ్చెక్కినట్లుంది.

ప్రియాంకకి భర్తమీద జాలి కలుగుతున్నా, తన పట్టు విడవడంలేదు. తనకు ఇంట్లో వుండడం అలవాటే కాబట్టి తన పనులు తాను చేసుకుంటూ, భర్తకు కావలసిన పనులు మౌనంగానే చేసిపెడ్తోంది.

బలాదూర్‌గా తిరిగిన శశాంక్‌కు ఇల్లే జైలయింది. టి.వి. చూడబుద్ధి కావడంలేదు, పుస్తకాలు చదవబుద్ధి కావడంలేదు.

భార్యతో మాట్లాడాలంటే సమాధానం రావడంలేదు. ప్రియాంక వ్యవహారమేమి అర్థంకావడంలేదు.

"ప్రియా! నేను ఇంత మాట్లాడుతున్నా నీవు ఒక్క సమాధానం కూడా ఇవ్వడంలేదేమి'' అనడిగాడు. దానిక్కూడా మౌనమే సమాధానమైంది.

భార్య ఆసరా వుంటేగాని, లేవలేని పరిస్థితిలో వున్నాడు శశాంక్, భార్యమౌనం, తను మింగుతున్న మాత్రల కన్నా చేదుగా వుంది.

ప్రియాంకను ఎలాగైనా మాట్లాడేలా చేయాలనుకున్నాడు.

"ప్రియా! ఆరోజు స్కూల్లో పేరెంట్స్, టీచర్ మీటింగ్‌కి వెళ్ళావు కదా! ఏమన్నారక్కడ!" అడిగాడు.

''కృత్తికా! నిన్న టీచర్ చెప్పిన లెసెన్స్ చదువుకున్నావా? రేపు నీకు ఓరల్ టెస్ట్, తెలుసా!" భర్త మాటను పట్టించుకోనట్లు కూతురిని ప్రశ్నించింది.

"డాక్టర్ దగ్గరకు మళ్ళీ ఎప్పుడు వెళ్ళాలి?'' కలుగుజేసుకున్నాడు శశాంక్.

"ఇక పడుకోమ్మ, నిద్ర టైమైంది" ప్రియాంక అంది కూతురితో శశాంక్‌ని అసలే గుర్తించనట్టు.

శశాంక్ నివ్వెరపోయాడు. ఆ నిస్సహాయ స్థితిలో భార్య మౌనముద్ర అతని కళ్ళలో నీళ్లయ్యాయి. కళ్ళ నిండా నీళ్ళతో భార్యను అలాగే చూస్తూ కూర్చున్నాడు.

ప్రియాంక కూతుర్ని నిద్రపుచ్చే పనిలో వుండడంతో భర్తని గమనించలేదు. ప్రియాంక వులిక్కిపడి భర్తవేపు చూసింది. నీళ్ళు నిండిన కళ్ళతో తనవైపే చూస్తున్న భర్తను చూసి దుఃఖాన్ని ఆపుకోలేక తనుకూడా ఏడ్చింది.

"ప్రియా! నాకు జ్వరం వచ్చిందగ్గర్నుండి నిన్ను గమనిస్తున్నాను. నీవు ఒక్కమారు కూడా సమాధానం చెప్పడంలేదు. ఎందుకని?" కళ్ళ

నుండి నీళ్ళు జలజల రాలుతుండగా అడిగాడు ప్రియాంకని.

దుఃఖంతో గొంతు పూడుకుపోతూంటే, మౌనాన్ని తుడిచేసి మొదటిసారిగా గొంతు విప్పింది ప్రియాంక.

"ఏవండీ ఇన్ని రోజులుగా మీరు మాతో ఎంత ముభావంగా వున్నారో ఎప్పుడైనా ఆలోచించారా? మీ కఠిన మనస్తత్వం మమ్మల్ని ఎంతగా బాధించిందో ఒక్కసారైనా మిమ్మల్ని మీరు ప్రశ్నించుకున్నారా? ఈ ఒక్కరోజు మౌనమే మీకు నరకంగా అనిపిస్తే, మేమిద్దరం ఎంత కాలం నుంచి దీన్ని అనుభవిస్తున్నామో మీరు వూహించండి. అది మీకు తెలియాలనే నేనీ మౌనం వహించాను గాని మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలనో, మీమీద పగతీర్చుకోవాలనో కాదండీ. భార్యకు కావలసింది భర్త సాన్నిహిత్యం" అని ముగించింది.

శ్రీకృష్ణుడు ఉపదేశించిన భగవద్గీతలో తనను తాను తెలుసుకున్న అర్జునుడిలా, శశాంక్ తను ఇంత కాలం చేసిన తప్పు భార్య మాటలద్వారా తెలుసుకుని, భార్య దగ్గర క్షమాపణ కోరాడు.

కాని మృదు స్వభావియైన ప్రియాంక "ఛ! అదేం మాటండి... నేను కోరుకున్నది మీలో మార్పేగాని ఇంకేమీ కాదు" అంది.

కృతజ్ఞతగా భార్యకళ్ళలోకి చూశాడు శశాంక్. ప్రియాంక నవ్వింది మౌనంగా.

✦✦✦

<u>కవిత</u>

# అక్షరం

\- వైశాలి

**అక్షరం** ఒక ఆయుధం అని
ఒకరంటే
అక్షరం ఒక అద్భుతం అని
నేనంటా
అక్షరంతో పోరాడి భాషను
నేర్చుకోవాలి
క్షయం కానిది
అక్షరమైతే
పోరాడి నేర్చినదేదీ
వృధాకాదు ఏనాడు
భాష భావానికి ప్రాణం
భాష మనకి ధైర్యాన్నిస్తుంది
భాష ఒక ఆభరణంగా వెంట ఉంటుంది
సకల శుభాలకు కారకమై
పరిపూర్ణత నిచ్చేదే
అక్షరం-

